పటిష్టంగా పారిశుధ్య నిర్వహణ

- ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాం
- చందానగర్ ఏఎంహెచ్ఓ రవికుమార్



ఇంటర్వ్యూ... ఈ

చందానగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నానని చందానగర్ జీహెచ్ఎంసీ పారిశుధ్య ప్రజారోగ్య అధికారి (ఏఎంహెచ్ఓ) డాక్టర్ రవికుమార్ అన్నారు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్లలోని కాలనీల్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పారిశుధ్య రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. రోడ్లపై మొబైల్ శానిటేషన్ కార్యక్రమాన్ని తీసుకుని నిత్యం శానిటేషన్ సూపర్‌వైజర్లు పనులను పరిశీలిస్తున్నారని తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణ ఎలా సాధ్యం?

సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు రోజువారీగా కొనసాగుతున్నాయి. ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు వారికి కేటాయించిన కాలనీల్లో నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా సమస్య ఉంటే తక్షణచర్యలు తీసుకుంటాం.

పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కుగా ఉంది. ఎలా సాధ్యం ?

కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. ఉన్నవారిలో నైపుణ్య శిక్షణతోపాటు వారిలో వృత్తిపై ప్రేరణ కల్పించి చేసే పని సులభతరంగా చేసేందుకు కృషి చేస్తున్నాం.

ఇళ్లల్లో తడి..పొడి చెత్తను వేరుచేయకుండా కలిపి ఇస్తున్నారు. వాస్తవమా ?

ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు ప్రతి ఇంటికీ డబ్బాలు ఇచ్చాం. ఆ విధంగా కొందరు వేరుచేసి ఇస్తున్నారు. ఇవ్వని వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. స్వచ్ఛ ఆటోలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించని వారిపై చర్యలు చేపడతాం.

వారాంతపు మార్కెట్‌లలో ఏర్పడే చెత్తను ఎలా తొలగిస్తారు?

వారాంతపు సంతల్లో ఏర్పాడే వ్యర్థాలను తొలగించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. ఈ మార్కెట్‌లలో వెంటర్స్ సహకారంతో కొందరిని నియమించి వారి ద్వారా చెత్తను సేకరించే పద్ధతి ఒకటైతే.. వెండర్స్‌కి నల్ల కవర్లు ఇచ్చి ఎవరి చెత్తను వారే సంచులల్లో వేసి, ఓ ప్రాంతంలో సమీకరించి అక్కడి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా తొలగిస్తున్నాం.

సర్కిల్ పరిధిలోని అన్ని బస్తీల్లో కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయా?

సర్కిల్ పరిధిలోని 168 కాలనీల్లో, 16 బస్తీల్లో నిరంతరం పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. కొన్ని కాలనీల్లో రాంకీ సంస్థ పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో వారు చేసే పనులను పర్యవేక్షిస్తూ అన్ని కాలనీల్లో నిరంతరం చేపడుతున్నాం.

జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ హామీ



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపట్టడంతో పాటు అవసరమైతే మరో ఎకరా స్థలం మంజూరుకు తనవంతు సహకారం అందిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులు శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విఠల్‌రెడ్డి, జిలా అధ్యక్షుడు శేఖర్‌సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి అధ్యక్షుడు రమేష్ సాగర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జర్నలిస్టులు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చందానగర్‌లోని సర్వే నెంబరు 174లో ఎకరా స్థలాన్ని కేటాయించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే స్థలానికి ఆనుకుని ఉన్న సర్వేనెంబరు 152ని దృష్టికి తీసుకువచ్చారు. అదనపు స్థలం కేటాయించేందుకు సహకారం అందించాలని కోరారు. దశాబ్దాల కాలంగా శేరిలింగంపల్లిలో జర్నలిస్టులుగా పనిచేస్తూ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఎమ్మెల్యే గాంధీ సహకారంతోనే ఎకరా స్థలాన్ని పొంది భూమిపూజ సైతం చేసుకున్నామని తెలిపారు. అట్టి స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం సహకారం అందించాలని కోరారు. కాగా శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా పక్కనే ఉన్న సర్వేనెంబరు 152లో ఉన్న మరో ఎకరా స్థలాన్ని మంజూరు చేయించే విధంగా ఎమ్మెల్యే గాంధీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టుల సొంతింటి కల సాకారం కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు సుముఖంగా ఉన్నారని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీల పంపిణీ

హైదర్‌నగర్: హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్‌హఫీజ్‌పేటకు చెందిన వహీద్‌అలీ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసున్నాడు. అతని కుటుంబ సభ్యులకు రూ.2.50లక్షల మంజూరీ పత్రాలను శనివారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన స్ప్రింగ్‌వ్యాలీ అసోసియేషన్

శేరిలింగంపల్లి డివిజన్ స్ప్రింగ్ వ్యాలీ కాలనీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా కాలనీ అభివృద్ధికి కృషిచేయాలని, తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఏ చిన్న సమస్యవచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు గుమ్మడి సాయిచౌదరి, డీవీఎస్ మనోజ్‌కుమార్, జనరల్ సెక్రటరీ చైతన్యకుమార్, జాయింట్ సెక్రటరీ రాజేష్ మనీష్, సియాల్, ట్రెజరర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయండి

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను కోరిన సీపీ అవినాష్ మహంతి



అధికారులకు మెమెంటోలు ఇస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో, హత్య, హత్యాచారం, ఎన్‌డీపీఎస్ వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు గరిష్ఠ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి కోరారు. సైబరాబాద్ కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పీపీ, ఏపీపీల రివార్డుల కార్యక్రమంలో పీపీలు, ఏపీపీలు, ఐఓలు, ఇన్‌స్పెక్టర్‌లు, లైజన్ ఆఫీసర్, సీడీడీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ నమోదైన కేసుల్లో శిక్షలశాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు. దీనికోసం జోనల్ డీసీపీలు విచారణాధికారులు, కోర్టు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ పోలీసులు, న్యాయవ్యవస్థ కలిసి పని చేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శోభారాణి మాట్లాడుతూ రివార్డుల మేళాలు ఏర్పాటు చేయడం ద్వారా శిక్షల శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పీపీ, ఏపీపీలు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

దీపావళి, చాట్ పండుగల కోసం మరిన్ని ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి, చాట్ పండుగల సందర్భంగా సికింద్రాబాద్-గోరక్‌పూర్-సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, నవంబర్ 5, 12 తేదీల్లో సికింద్రాబాద్-గోరక్‌పూర్ (07175) ప్రత్యేక రైళ్లు, ఈనెల 31, నవంబర్ 7, 14 తేదీల్లో గోరక్‌పూర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. నవంబర్ 2న హెచ్ఎస్.నాందేడ్- పన్వెల్ (07685)మధ్య, 3న పన్వెల్-హెచ్ఎస్.నాందేడ్(07686) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్31, నవంబర్7,14 తేదీల్లో సనత్‌నగర్-రాయిపూర్ మధ్య(07023) నవంబర్ 1, 8, 15 తేదీల్లో రాయిపూర్-సనత్‌నగర్‌ల మధ్య (07024) ప్రత్యేకరైళ్లు నడుస్తాయని వివరించారు.

యశ్వంత్‌పూర్-బీదర్ మధ్య రైళ్ల రద్దు

యశ్వంత్‌పూర్-బీదర్(16577)ల మధ్య నవంబర్ 2 ,9, 16, 23, 30, డిసెంబర్ 7, 14, 21, 28, జనవరి 4, 11, 18, 25, ఫిబ్రవరి 1, 8, 15, 22, మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో నడిచే రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. బీదర్-యశ్వంత్‌పూర్ (16578) మధ్య నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19, 26, ఫిబ్రవరి 2, 9, 16, 23, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో నడిచే రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.1500 కోట్లకు కుచ్చుటోపీ!

మాకు న్యాయం చేయాలి: 'ధన్వంతరి' బాధితుల ఫోరం

మంత్రాలయం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన ధన్వంతరీ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ పంతాంగి కమలాకర్‌శర్మ రూ.1500 కోట్లు కుచ్చుటోపీ పెట్టారని, తమకు న్యాయం చేయాలని ధన్వంతరీ ఫౌండేషన్ బాధితుల ఫోరం సభ్యులు కోరారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ, సభ్యులు శేషగిరిరావు, రంగారావు, రాజ్యలక్ష్మి విలేకరులతో మాట్లాడారు. 2004లో బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన ధన్వంతరీ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థను మరికొందరితో కలిసి కమలాకర్‌శర్మ ఏర్పాటు చేశారని చెప్పారు.

ఇందులో దాదాపు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుకు చెందిన 400 మంది బ్రాహ్మణులను సభ్యులుగా చేర్చి 15 నుంచి 20 శాతం వడ్డీ ఇస్తామని ఆశ చూపి రూ.లక్ష నుంచి రూ.3 కోట్ల వరకు తీసుకున్నారని ఆరోపించారు. 2023 నుంచి కమలాకర్ శర్మ తప్పించుకు తిరుగుతున్నాడన్నారు.

ఆకట్టుకున్న ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



విద్యార్థి తయారు చేసిన నమూనా

హైదర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ భారతి విద్యాలయ పాఠశాలలో శనివారం ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల నమూనాలు, ప్రాజెక్ట్ తయారుచేసి ప్రదర్శించారు. ఈ నమూనాలను పాఠశాల చైర్మన్ ఇంద్రసేనరెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను వెలికి తీస్తాయన్నారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

హైదర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం కీర్తి హాస్పటల్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ గాంధీనగర్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



అవగాహన కార్యక్రమంలో బజాజ్ కంపెనీ ప్రతినిధులు

ఆకట్టుకున్న బజాజ్ ఆటో లిమిటెడ్ అవగాహన

హైదర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బజాజ్ ఆటో లిమిటెడ్ అభినందన్ బజాజ్, వరుణ బజాజ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్‌లో ఎన్ఎస్ 400 బజాజ్ వాహనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో వాహనప్రియులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బజాజ్ వాహనాలను డీపీ తమ అభిప్రాయాలను కంపెనీ నిర్వాహకులకు వెల్లడించారు. బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కంపెనీలో నూతనంగా వచ్చిన ఎన్ఎస్ 400 ద్విచక్రవాహనం ఆవశ్యకతను వాహనదారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రధానంగా వాహనాన్ని నడిపే విధానంతో పాటు వాటికి సంబంధించిన వివరాలను వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ స్టాలిన్, సేల్స్ మేనేజర్లు మౌర్య, సూర్య, సెలెక్ట్ బజాజ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పోలీస్ అమరవీరులకు నివాళి



పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ బ్యాండ్ వింగ్, ఇండియన్ ఆర్మీ బ్యాండ్ వింగ్‌లు కలిసి శనివారం శిల్పారామంలో అమరవీరులకు బ్యాండ్ ద్వారా ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోమ్‌గార్డ్స్ ఏసీపీ ఇంద్రవర్ధన్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

\- హైదరాబాద్‌సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

నిసమ్.. ఉద్యోగుల జోష్..!

ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఎక్సలెన్స్ అవార్డులు



వేదికపై నృత్యాలు చేస్తున్న 'నిసమ్' ఉద్యోగులు, అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ నిసమ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వార్షికోత్సవాన్ని జోష్-2024 పేరిట ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను ఉద్దేశించి సంస్థ సీఈఓ ఇంతియాజ్ మొహమ్మదీ, డెలివరీ హెడ్(ఇండియా) వీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా కంపెనీ సాధించిన విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ఉద్యోగులకు వివరించారు. ఈ ఏడాది సంస్థకు అద్భుతమైన విజయాన్ని అందించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అత్యుత్తమ పనితీరు, అంకితభావాన్ని కనబరిచిన ఉద్యోగులకు ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. అనంతరం ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి పాటలు, నృత్యాలు, నాటకాల ద్వారా తమలోని ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ అజాస్‌అహ్మద్, కంట్రీ హెడ్ బాబు చింతలపూడి, ఆపరేషన్స్ హెడ్ నిఖత్ మొహ్మదీ, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

భెల్‌కాలనీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధిని ముందస్తుగా గుర్తించి, చికిత్స చేయిస్తే నివారణ సాధ్యమవుతుందని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్ పేర్కొన్నారు. తలసీమియా బాధితుల సహాయార్థం శనివారం భెల్ టౌన్‌షిప్‌లోగల ఇంటర్నేషనల్ క్లబ్ ఆవరణలో తలసీమియా సికిల్‌సెల్ సొసైటీ, భెల్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 4.2శాతం మంది తలసీమియాతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో బాధితులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రుల భౌతిక లక్షణాలతో చాలా వరకు పిల్లలకు ఈ వ్యాధి సోకుతోందని, మొదట్లోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దాదాపు 70మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వెంకటేశ్, కరుణాకర్, రాజేష్, వెంకటేశం, తలసీమియా సొసైటీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

గచ్చిబౌలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం పురస్కరించుకుని హుడా ట్రేడ్ సెంటర్ గ్రీన్‌పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాలయం పాలకమండలి ముఖ్య సలహాదారు రామచంద్రమూర్తి, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల శుభ్రత ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాస్‌గౌడ్, మహేష్‌గౌడ్, రామయ్యచౌదరి, బుచ్చిరెడ్డి, యాదగిరిగౌడ్, సాయిబాబా, సురేందర్‌బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సీనియర్‌సిటిజన్స్, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

రాయదుర్గం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లోని పలు సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజ్ పైపులైను, సీసీ రోడ్ల, మంచినీటి సరఫరా వంటి అంశాలపై స్థానికులతో కలిసి తెలుసుకున్నారు. వారు కార్పొరేటర్ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలక్ష్మి, ఏఈ రషీద్, స్థానిక నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

బైక్ రేసింగ్ రైడర్లపై కేసులు - 40 బైకులు సీజ్

రాయదుర్గం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్ సిటీ రోడ్లపై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో బైక్ రేసింగ్, స్టంట్లతో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందికరంగా వ్యవహరించిన 40 మంది బైకర్లపై రాయదుర్గం పోలీసులు కేసులు నమోదు చేశారు. 40 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వారిపైన కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కొంతకాలంగా బైక్‌రేసులకు పాల్పడుతున్న వారిపైన చట్టపరంగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామని తెలిపారు.

చదువు కోసం వచ్చి.. గంజాయి విక్రయం

- ఇద్దరు డిగ్రీ విద్యార్థుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు నగరానికి వచ్చి మేడ్చల్ పరిధిలోని కేఎల్ఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న డిగ్రీ విద్యార్థులు అద్దె గదిలో ఉంటూ గంజాయిని సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేశారు. వారి నుంచి 1.16కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) సీఐ సుభాష్‌చందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన త్రినేత్ర, రఘుపతితో పాటు మరో విద్యార్థి నగరానికి వచ్చి కేఎల్ఆర్‌కాలనీలో అద్దె గదిలో ఉంటూ డిగ్రీ చదువుతున్నారు. రఘుపతి సీలేరు నుంచి కొద్ది మొత్తంలో గంజాయిని తెచ్చి, మిగిలిన ఇద్దరితో కలిసి అవసరమైన కస్టమర్లకు విక్రయిస్తున్నారు. రఘుపతి మిగిలిన ఇద్దరికి కమీషన్ రూపంలో డబ్బులు చెల్లించేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఇద్దరు విద్యార్థులను అరెస్టుచేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

నవంబర్‌లో చెకుముకి సంబురాలు : డీఈఓ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబర్‌లో జరుగనున్న చెకుముకి సంబురాల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని డీఈఓ రోహిణి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సంబరాల పోస్టర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ నవంబర్ 7న పాఠశాలస్థాయి, నవంబర్ 21న మండలస్థాయి, 28న జిల్లా స్థాయిల్లో సైన్స్ టెస్ట్‌లుంటాయని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయిపోటీలు ఉంటాయన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ లింగస్వామి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎం .రవీంద్రబాబు, నగర నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్స దశ దాటిన వారికి పాలియేటివ్ కేర్ అవసరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ చికిత్స చేసే దశ కూడా దాటిపోయిన బాధితులకు కావాల్సింది ఉపశమన చికిత్స (పాలియేటివ్ కేర్) అని వక్తలు అన్నారు. నిరూపిత ఆధారిత ఉపశమన సంరక్షణపై తొలి జెల్లా నాందేడ్కర్ మెమోరియల్ హైబ్రిడ్ సింపోజియం శనివారం మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ఇండో-అమెరికన్ క్యాన్సర్ అసోసియేషన్‌తో కలిసి పెయిన్ రిలీఫ్ అండ్ పాలియేటివ్ కేర్ సొసైటీ, హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సింపోజియంలో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పాలియేటివ్ కేర్, రీహాబిలిటేషన్, ఇంటిగ్రేటివ్ మెడిసన్ టెన్యూర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామ్ యెన్ను, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీలో పెయిన్ అండ్ పాలియేటివ్‌కేర్ హెచ్ఓడీ డాక్టర్ గాయత్రి పలట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ భారతదేశంలో పాలియేటివ్ నిపుణుల కొరత ఉందన్నారు.క్యాన్సర్ పోరాట యోధురాలు, శాస్త్రవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ జె.సంధ్య నాందేడ్కర్ మెమోరియల్ సింపోజియం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో ఇండో-అమెరికన్ క్యాన్సర్ అసోసియేషన్, పాలియేటివ్ కేర్ ప్రోగ్రామ్ చైర్‌డాక్టర్ సురేష్‌కె.రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి : ఎమ్మెల్యే



క్యాంపు కార్యాలయంలో బాలాజీనగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి నిలిచిపోయిందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషబాబురావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, అధ్యక్షుడు సీహెచ్.ప్రభాకర్‌గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్‌చౌదరి, నాయకులుపాల్గొన్నారు.

●మూసాపేటకు చెందిన ఎండీ ఫరుద్దుదీన్ అనారోగ్య రీత్యా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి మంజూరైన రూ.లక్ష చెక్కును లబ్ధిదారుడికి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కృష్ణారావు శనివారం అందజేశారు.

ఆర్ఓబీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



జడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని లింగంపల్లి రైల్వేబ్రిడ్జి వద్ద జరుగుతున్న నాలా పనులను వేగవంతం చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, స్థానిక నాయకులు ఎల్లేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు జోనల్‌కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతియేటా వర్షాలు పడిన ప్రతిసారి రైల్వేబ్రిడ్జి వద్ద వరదనీరు చేరి రాకపోకలు నిలిచిపోతున్నాయని అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పనులు ప్రారంభిస్తారని, అయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కనీసం ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. మరోవైపు నాలా విస్తర్ణ చేయకుండా పనులు జరుగుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనికి జడ్‌సీ స్పందిస్తు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ప్రజా సమస్యలను పరిగణలోకి తీసుకుని పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పనుల పరిశీలన

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదముంపు శాశ్వత పరిష్కారం కోసం యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, గడువులోగా పనులు పూర్తిచేస్తామని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. కల్వర్టు వద్ద బాక్స్‌నాలా పనులను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాక్సు నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నాలా విస్తర్ణ పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అత్యాచార బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ

50 వేల ఆర్థిక సాయం అందజేత

హైదర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బౌరంపేట్ అత్యాచార బాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించారు. శనివారం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు మంత్రి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలను దాచుకొని పెంచవల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్టు చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రభుత్వం తరుపున బాలిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాలిక తల్లిదండ్రులకు తక్షణ ఖర్చుల కింద రూ.50వేల ఆర్థిక సహాయాన్ని సీతక్క అందజేశారు. పరామర్శించిన వారిలో మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద, పీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, అధికారులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

చందానగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ విగ్రహమూర్తులకు అభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరగగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారిని గరుడవాహనంపై వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యవర్గ సభ్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్

రాయదుర్గం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గౌలిదొడ్డిలోని కేశవనగర్‌లో ప్రభుత్వ పాఠశాలను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలలో ఉన్న పలు సమస్యల గురించి ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత, స్థానిక నాయకులు దార్గుపల్లి ప్రసాద్, తిరుపతి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణంతో ప్రయాణం సుగమం

మియాపూర్: సీసీరోడ్ల నిర్మాణంలో కృషి నగర్‌లో కాలనీవాసుల ప్రధాన సమస్యపరిష్కారం అయిందని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో గల కృషి నగర్‌లో రోడ్ల నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీవాసులు చిలుకూరి శ్రీనివాస్, వంశీకృష్ణారెడ్డి, పాపిరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ప్రతిఒక్కరి ఇంట్లో వెలుగులు నింపాలి

• సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎనపోతుల రాజు



దీపావళి అంటేనే పటాకుల మోత. భూమిమీద పేల్చే బాంబులే కాదు, ఆకాశంలో పేలే పటాసులను కూడా పెద్ద ఎత్తున కాలుస్తుంటారు. ఎంత ఎక్కువ కాలిస్తే అంత ఎక్కువ ఎంజాయ్ చేసినట్టు అనుకుంటారు. ఎవరెక్కువ శబ్దం వచ్చేలా పటాసులను పేల్చితే వాళ్లదే పైచేయి అన్నట్టు భావిస్తుంటారు. ఇదంతా ఒకప్పటి మాట. పండుగలు ఏవైనా సరే అందరం సంతోషంగా జరుపుకోవాలి. పర్యావరణాన్ని కూడా కాపాడుకోవాలి. పర్యావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగి పోకుండా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. దీపావళి పండుగ అంటే ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలే కాని కాలుష్యం కాదు. దీపావళి రోజు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదం కూడా దాగి ఉంటుందని గమనించాలి. టపాసుల దుకాణదారులు కూడా నిబంధనలు పాటించాలి. శనివారం సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎనపోతుల రాజు దీపావళి రోజు పాటించాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

- బాలానగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)

సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ పరిధిలోకి ఏఏ ప్రాంతాలు వస్తాయి?

సనత్‌నగర్ ఫైర్ స్టేషన్‌పరిధిలో బాలానగర్, ఫతేనగర్, మూసాపేట్,ఐడీపీఎల్, ఎస్సార్‌నగర్, అమీర్‌పేట్, బోరబండ, ధరంకరణ్‌రోడ్డు, బల్కంపేట్, యూసుఫ్‌గూడ, మోతీనగర్ ప్రాంతాలు సనత్‌నగర్ పరిధిలోకి వస్తాయి.

టపాసుల దుకాణదారులు ఎలాంటి నిబంధనలు పాటించాలి?

అగ్నిమాపక శాఖ నిబంధనల మేరకు టపాసుల దుకాణదారులు తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలి. దుకాణం పెట్టాలనుకున్నప్పుడు స్థల యజమాని, కమ్యూనిటీ హాల్ అయితే అక్కడి అసోసియేషన్ నుంచి అనుమతి (ఎన్ఓసీ)తీసుకుని ఈ సేవాలో అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి నిర్ణీత రుసుము రూ. 500 చెల్లించాలి. వివరాలు అందిన వెంటనే తనిఖీ చేసి సమర్పించిన వివరాలు సరిగ్గా ఉంటే అనుమతి ఇస్తాం. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో సమాచారం సరిగ్గాలేకుంటే లైసెన్స్‌ను రద్దు చేసే అవకాశం ఉంటుంది.

దుకాణాలు ఎక్కడెక్కడ పెట్టుకోవాలి?

ఏమైన అవగాహన కల్పిస్తున్నారు?

నివాసిత ప్రాంతాలకు దూరంగా ఖాళీ స్థలంలో అనుమతిని పొందిన ప్రదేశంలోనే దుకాణాలు ఏర్పాటు చేయాలి. నివాసిత ప్రాంతాలు, విద్యా సంస్థలు, సినిమాహాల్స్ మార్కెట్లు, ఫ్యాక్టరీలు, రైల్వే లైన్లు, చర్చిలు, మసీదులు, దేవాలయాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. దుకాణాలను అస్బెస్టాస్, జీఐ, జింక్ వంటి మెటీరియల్‌తో ఏర్పాటు చేయాలి. ఎదురెదురుగా క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. లైసెన్స్ కోసం ఇప్పటి వరకు 124 మంది దరఖాస్తు చేసుకున్నారు. సరైనా ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రెండింటిని తిరస్కరించాం. సనత్‌నగర్ పరిధిలోని పోలీసు, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా సోమవారం సనత్‌నగర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు దుకాణం దారులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసిన చోట నో స్మోకింగ్ జోన్ అని బోర్డులు పెట్టాలి. దుకాణాల్లో గ్యాస్, లేదా నూనే దీపాలను వినియోగించరాదు. విద్యుత్తు కనెక్షన్ తీసుకుంటే కరెంటు తీగల మధ్య జాయింట్లు లేకుంటా షాట్ సర్క్యూట్ జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైన అగ్ని ప్రమాదం సంభించే సమయంలో మంటలు ఆర్పేందుకు ప్రతీషాపు వద్ద సుమారు 200లీటర్లు ఉన్న రెండు నీటి డ్రమ్ములను, మంటలు ఆర్పే యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలి. ఏదైన అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ కంట్రోల్ రూం 101కు వెంటనే సమాచారం అందించాలి. దుకాణాల్లో మైనర్లలు, దివ్యాంగులలు, మానసిక వికలాంగులను పనికోసం పెట్టుకో కూడదు.

టపాసులు పేల్చేవారికి మీరిచ్చే సమాదానం?

ఇంటివద్ద టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో అస్తమా, సీవోపీడీ పేషెంట్లు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. తుమ్ములు, జలుబు, తలనొప్పి వంటి రుగ్మతలు కలుగుతాయి. అధిక శబ్దంతో పేలే టపాసుల వల్ల కర్ణబేరి దెబ్బతినే ప్రమాదం ఉంది. టపాసులు పేల్చే సమయంలో తల్లి తండ్రులు పిల్లలను కనిపెట్టుకొని ఉండాలి.

రాబోయే దీపావళిని ప్రమాద రహితంగా రంగుల దీపావళిని జరుపుకోవాలని ఆశిస్తూ అగ్నిమాపక శాఖ తరుపున దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఆకట్టుకున్న బజాజ్ ఆటో లిమిటెడ్ అవగాహన



అవగాహన కార్యక్రమంలో బజాజ్ కంపెనీ ప్రతినిధులు

హైదర్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బజాజ్ ఆటో లిమిటెడ్ అభినందన్ బజాజ్, వరుణు బజాజ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్‌లో ఎన్ఎస్ 400 బజాజ్ వాహనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో వాహనప్రియులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బజాజ్ వాహనాలను డీపీ తమ అభిప్రాయాలను కంపెనీ నిర్వాహకులకు వెల్లడించారు. బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కంపెనీలో నూతనంగా వచ్చిన ఎన్ఎస్ 400 ద్విచక్రవాహనం అవశ్యకతను వాహనదారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రధానంగా వాహనాన్ని నడిపే విధానంతో పాటు వాటికి సంబంధించిన వివరాలను వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ స్టాలిన్, సేల్స్ మేనేజర్లు మౌర్య, సూర్య, సెలెక్ట్ బజాజ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్

- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- స్థలం కేటాయించని హోటల్ యాజమాన్యం
- నిజాంపేట్ క్రాస్‌రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ జాం
- నిరుపయోగంగా సమతానగర్ లింక్ రోడ్డు

ప్రజా రవాణాకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు చేపట్టాల్సిన ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యం తీరు మితి మీరి పోతోంది. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట్ రోడ్డులోని ఓ రెస్టారెంట్‌కు కనీస పార్కింగ్ స్థలం లేదు. హోటల్‌కు వచ్చేవారు రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



నిజాంపేట్ క్రాస్‌రోడ్ మూలమలుపు వద్ద ట్రాఫిక్‌జాం



హోటల్ ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

హైదర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట రోడ్డు నుంచి జాతీయ రహదారి పైకి భారీ సంఖ్యలో వచ్చే వాహనాలు హోటల్ ఎదుట పార్క్‌చేసి ఉంచడంతో నిత్యం కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. జాతీయ రహదారి నుంచి లింకురోడ్డు మీదుగా సమతానగర్, ప్రగతినగర్ వెళ్లాల్సిన వాహనాలకు కూడా ఆటంకం కలుగుతోంది. ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి ప్రైవేట్ స్థలాన్ని సేకరించి నిర్మించిన లింక్‌రోడ్డు నిరుపయోగంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వం ముందు చూపుతో ఏర్పాటు చేసిన లింక్ రోడ్ల లక్ష్యం కూడా వ్యర్థమవుతోంది.

పోలీసుల చర్యలు శూన్యం

రోడ్లపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్టుగా వ్యవహరించడంతో హోటల్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవ హరిస్తున్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నపట్టికీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోక పోవడంతో జాతీయ రహదారిపై, నిజాంపేట రోడ్డు నుంచి వస్తున్న వాహనాలు గంటల తరబడి రోడ్లపై నిలబడాల్సి వస్తోంది. రోడ్డుపై ఎక్కడో ఓచోట వాహనాన్ని నిలిపితే రెండు నిమిషాల్లో ఫొటోలు తీసి జరిమానా విధించే ట్రాఫిక్ పోలీసులు రోజుల తరబడి హోటల్ ఎదుట వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేస్తున్నా కనీస చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మామూళ్ల కోసమే వదిలేస్తున్నారని స్థానికుల మాటలకు బలం చేకూర్చేలా ఉన్నాయి. ప్రతి రోజూ అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజాము వరకు నిరాటంకంగా హోటల్ నడుస్తుండడం చూస్తుంటే ఈ హోటల్ వ్యాపారానికి లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం అండదండలందిస్తున్నట్టు ఉంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి హోటల్ ఎదురుగా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాల్సి ఉంది. అనుమతులకు విరుద్ధంతో పాటు సమయానికి మించి వ్యాపారం కొనసాగిస్తున్న హోటల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు మీద వాహనాలు నిలపకుండా చర్యలు



రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారనే విషయంపై చర్యలు తీసుకుంటున్నాం. నిజాంపేట క్రాస్‌రోడ్డు నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటోంది. ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. సర్వీస్ రోడ్డులో మెట్రో పార్కింగ్, ఆటో స్టాండ్ కూడా ఉండడంతో అక్కడ కొద్దిగ ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. అయిన స్వయంగా పర్యవేక్షించి వాహన దారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- జానయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లి రైతు బజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతు బజార్‌లో కిలో కూరగాయలు ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ. 35, వంకాయ రూ. 40, బెండకాయ రూ. 65, పచ్చి మిర్చి రూ. 35, బజ్జి మిర్చి రూ. 65, కాకరకాయ రూ. 38, బీరకాయ రూ. 55, క్యాబేజీ రూ. 19, బీన్స్ రూ. 115, క్యారెట్ రూ. 45, గోబి పువ్వు రూ. 23, దొండకాయ రూ. 35, చిక్కుడు కాయ రూ. 85, గోరు చిక్కుడు రూ. 55, బీట్‌రూట్ రూ. 37, క్యాంప్సికం రూ. 75, ఆలుగడ్డ రూ. 37, కీర రూ. 31, దోసకాయ రూ. 40, సొరకాయ రూ. 25, పొట్లకాయ రూ. 18, కంద రూ. 60, ఉల్లిపొరక రూ. 55, ఉల్లి గడ్డ రూ. 50, మామిడి కాయ రూ. 15-20, అరటికాయ రూ. 8-9, చామగడ్డ రూ. 37, ముల్లంగి రూ. 4-5, చిలగడ దుంప రూ. 40, గుమ్మడికాయ రూ. 30, నిమ్మకాయలు రూ. 50-60, మునగ కాయలు రూ. 8-10, బొప్పాయి రూ. 40, పుట్టగొడుగులు రూ. 40, ఎండు మిర్చి రూ. 220, అల్లం రూ. 160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ. 80, ఉసిరి రూ. 100, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.65, లోబా రూ. 40, ఆ కాకరకాయ రూ. 100. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయండి

• పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కోరిన సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో, హత్య, హత్యాచారం, ఎన్‌డీపీఎస్ వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు గరిష్ట శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి కోరారు. సైబరాబాద్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసి పీపీ, ఏపీపీల రివార్డుల కార్యక్రమంలో పీపీలు, ఏపీపీలు, ఐఓలు, ఇన్‌స్పెక్టర్‌లు, లైసన్ ఆఫీసర్, సీడీడీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ నమోదైన కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు. దీనికోసం జోనల్ డీసీపీలు విచారణాధికారులు, కోర్టు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ పోలీసులు, న్యాయవ్యవస్థ కలిసి పనిచేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శోభారాణి మాట్లాడుతూ రివార్డుల మేళాలు ఏర్పాటు చేయడం ద్వారా శిక్షల శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పీపీ, ఏపీపీలు, లైసనింగ్ అధికారులు పాల్గొన్నారు.



కేసుల్లో గరిష్ట శిక్ష పడేలా చూపిన అధికారులకు మెమోంటోలు ఇస్తున్న సీపీ అవినాష్ మహంతి

హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఉమేశ్ అంబేడ్కర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘాల ఎన్నికలు ముగిశాయి. శుక్రవారం పోలింగ్ జరగగా శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 11.30గంటలకు పూర్తి కావడంతో రిటర్నింగ్ అధికారులు ఫలితాలను ప్రకటించారు. స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ స్కాలర్ ఎ.ఉమేశ్ అంబేడ్కర్ విజయకేతనం ఎగురవేశారు. కర్నూలు జిల్లాకు చెందిన ఉమేశ్ దళిత్ స్టూడెంట్స్ యూనియన్ తరఫున ప్రెసిడెంట్ అభ్యర్థిగా నిలిచారు. తన సమీప ఇండిపెండెంట్ అభ్యర్థి ఆకాశ్ భాటిపై 18ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలుపొందారు. ఉమేశ్‌కు మొత్తం 1,313ఓట్లు రాగా, ఆకాశ్‌కు 1295ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ఆకాశ్‌కుమార్(ఏఎస్‌ఏ), ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎఫ్ఐ నుంచి నిహాద్ సులేమాన్, సంయుక్త కార్యదర్శిగా బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) నుంచి త్రివేణి, సాంస్కృతిక కార్యదర్శిగా ఏఎస్ఏకు చెందిన కేవీ క్రిష్ణమూర్తి, క్రీడల కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఎన్ఎస్‌యూఐకి చెందిన మాంగ్‌పీ ఎన్నికయ్యారు.

స్కూల్ బోర్డ్ మెంబర్లు వీరే..

హెచ్‌సీయూలో స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గంతో పాటు వివిధ స్కూల్స్‌కు సంబంధించిన బోర్డు సభ్యులను కూడా విద్యార్థులు ఎన్నుకున్నారు. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ బోర్డు మెంబరుగా ఎస్.వినోద్, హ్యూమనిటీస్‌కు లెనిన్ ప్రసాద్, లైఫ్‌సైన్సెస్‌కు జాఫర్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్‌కు నయన్‌సింగ్, మెడికల్ సైన్సెస్‌కు సిర్సె ఖుషీ, ఫిజిక్స్‌కు ఆదిత్య రవీంద్రన్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌కు కె.అభిషేక్, సోషల్ సైన్సెస్‌కు ఎంఆర్ జోసెఫ్, కెమిస్ట్రీకి ఆదితపాల్, కంప్యూటర్ ఇన్ఫర్మాటిక్స్‌కు ప్రజ్వల్, ఇంజనీరింగ్‌కు శ్రీవాత్సవ, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ బోర్డు మెంబర్‌గా అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.



కూకట్‌పల్లి భారత్ వికాస్‌పరిషత్ హాల్‌లో శనివారం నిర్వహించిన మార్వెల్యూస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి శ్రీ.వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిత్రకారుడు డా. గోనె లింగరాజు

బౌరంపేట్ అత్యాచార బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ

• రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత

హైదర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బౌరంపేట్ అత్యాచార బాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించారు. శనివారం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు మంత్రి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలను దాచుకొని పెంచవల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్టు చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున బాలిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాలిక తల్లిదండ్రులకు తక్షణ ఖర్చుల కింద రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని సీతక్క అందజేశారు. బాలికను పరామర్శించిన వారిలో మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద, పీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, అధికారులు ఉన్నారు.

పుష్పారెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



పుష్పారెడ్డిని పరామర్శిస్తున్న శేరిసతీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు

బాలానగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండకింది పుష్పారెడ్డిని కాంగ్రెస్ నాయకులు శనివారం పరామర్శించారు. మోకాలి నొప్పితో బాధపడుతున్న ఆమె ఇటీవల సర్జరీ చేసుకుని ఫిరోజ్‌గూడలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంన్నారు. కేపీహెచ్‌బీకి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు శేరిసతీష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణీంద్ర, రాజేష్‌గౌడ్, మోయిజ్‌లు ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.

ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ట పూజలు

బాలానగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ సాయినాగేంద్ర ఆలయంలో ఆదివారం నుంచి ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ట, సామూహిక కల్యాణ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మెన్ అంబటి సునీల్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈనెల 29 వరకు పూజలు ఉంటాయన్నారు. ఈనెల 28న ఉదయం అభిషేకం, ధన్వంతరి హోమం, గోపూజ, ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ట, 29న మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు నిర్వహించాలని ఆయన కోరారు.



● హిందూ ముస్లింలనే తేడా లేకుండా స్నేహ పూరిత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మైనారిటీ నాయకులు ఎండీ నసీర్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ ఇందిరా గాంధీపురంలో జరిగిన మిలాదున్ నబీ ప్రత్యేక ప్రార్థనల్లో నసీర్, బాలానగర్ మాజీ కార్పొరేటర్ నరేంద్రాచార్య పాల్గొని మతపెద్ద మౌలానా ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇమ్రాన్, అఫ్జల్ పాల్గొన్నారు.

- ఫతేనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)

దీపావళి, చాట్ పండుగలకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి, చాట్ పండుగల సందర్భంగా సికింద్రాబాద్-గోరక్‌పూర్-సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, నవంబర్ 5, 12 తేదీల్లో సికింద్రాబాద్-గోరక్‌పూర్ (07175) ప్రత్యేక రైళ్లు, ఈనెల 31, నవంబర్ 7, 14 తేదీల్లో గోరక్‌పూర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. నవంబర్ 2న హెచ్ఎస్.నాందేడ్- పన్వెల్ (07685) మధ్య, 3న పన్వెల్-హెచ్ఎస్.నాందేడ్(07686) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. అక్టోబర్31, నవంబర్7,14 తేదీల్లో సనత్‌నగర్-రాయిపూర్ మధ్య (07023) నవంబర్ 1, 8, 15 తేదీల్లో రాయిపూర్-సనత్‌నగర్‌ల మధ్య (07024) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వివరించారు.

యశ్వంత్‌పూర్-బీదర్ మధ్య రైళ్ల రద్దు

యశ్వంత్‌పూర్-బీదర్(16577)ల మధ్య నవంబర్ 2 ,9, 16, 23, 30, డిసెంబర్ 7, 14, 21, 28, జనవరి 4, 11, 18, 25, ఫిబ్రవరి 1, 8, 15, 22, మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో నడిచే రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. బీదర్-యశ్వంత్‌పూర్ (16578) ల మధ్య నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19, 26, ఫిబ్రవరి 2, 9, 16, 23, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో నడిచే రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

చెకుముకి సంబురాల్లో పాల్గొనాలి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబర్‌లో జరుగనున్న చెకుముకి సంబురాల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని డీఈఓ రోహిణి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవంబర్ 7న పాఠశాలస్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయిల్లో సైన్స్ టెస్టులుంటాయని తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ లింగస్వామి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎం. రవీంద్ర బాబు, నగర నాయకులు పాల్గొన్నారు.

నేడు కేపీహెచ్‌బీ బంద్

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిపై దాడిని ఖండిస్తూ ఆదివారం కేపీహెచ్‌బీలోని వ్యాపార, వాణిజ్య సముదాయాల బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చారు. హిందువులు అంతా ఏకమై ముక్తకంఠంతో ఖండించాలని, ఆలయాలపై దాడి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు.

కింగ్స్ అండ్ క్వీన్స్ బార్‌పై కేసు

హైదర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి భారీ శబ్దాలతో డీజే పెట్టి స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్న ఓ బార్‌పై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూ రోడ్డులోని మంజీర మెజిస్టిక్ మాల్‌లో కింగ్స్ అండ్ క్వీన్స్ రెస్ట్రో బార్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి బార్ నిర్వాహకులు డీజే సౌండ్లు భారీగా పెట్టినట్టు స్థానికుల ద్వారా పెట్రోలింగ్ వాహనానికి సమాచారం అందింది. హోంగార్డు మేఘయ్య బార్ వద్దకు వెళ్లి సౌండ్ తగ్గించాల్సిందిగా బార్ నిర్వాహకులకు సూచించారు. వారు సౌండ్ తగ్గించకుండా పోలీసుల సూచనను పట్టించుకోకుండా భారీ శబ్దాలు కొనసాగించారు. ఈ మేరకు కానిస్టేబుల్ గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ రెస్ట్రోబార్ యువతులతో అసభ్య నృత్యాలు, అర్ధరాత్రి వేళల్లో భారీ డీజే సౌండ్‌లు పెట్టి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పలుమార్లు ఫిర్యాదులు ఉన్నా కేపీహెచ్‌బీ పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి.


జైలు అదాలత్‌లో 95 కేసుల పరిష్కారం

• 84 మంది ఖైదీలకు విముక్తి

సైదాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో శనివారం నిర్వహించిన జైలు అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించగా 84మంది అండర్ ట్రయల్ ఖైదీలకు విముక్తి లభించింది. నాంపల్లి క్రిమినల్ కోర్టు, రైల్వే, ఫ్యామిలీ, ఎక్సైజ్ కోర్టుకు సంబంధించిన కేసులు పరిష్కరించారు. సుమారు 12మంది వివిధ కోర్టుల న్యాయమూర్తులు పాల్గొని కేసుల విచారణ చేపట్టి ఖైదీలకు విముక్తి కలిగించారు. ఖైదీలకు సత్వర న్యాయం అందేందుకు జైలు అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్‌రెడ్డి, దేవ్లా, జైలర్లు దేవ్‌సింగ్, జలంధర్, అచ్చయ్య, తిరుమల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

95 శాతం అభివృద్ధి విషయం మరిచారా?

• కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



బాలానగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన వాఖ్యలను కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ ఒక ప్రకటనలో ఖండించారు. గత ఎన్నికల ప్రచారంలో 95 శాతం అభివృద్ధి పనులు తామే పూర్తి చేశామని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పుడు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బండి రమేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వమే 95 శాతం పనులు పూర్తయ్యాయని ఊక దంపుడు దంచాక ఇంకా చేయడానికి ఏమి మిగిలి ఉంటుందని ఆయన ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో అసంపూర్తిగా చేసి వదిలేసిన పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తోందని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తన అసమర్థతను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ చేపడుతున్న సంచలనాత్మక నిర్ణయాలతో తన పార్టీ క్యాడర్ ఎక్కడ దూరమవుతుందోననే బెంగ పట్టుకుందని ఎద్దేవా చేశారు.

తాళం పగులగొట్టి ఇంటి గోడలు కూల్చివేత

• వాగ్వాదానికి దిగడంతో వెళ్లిపోయిన అధికారులు



హెచ్‌ఐజీ 53లో జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేసిన ఇంటి గోడలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం బాలాజీనగర్‌లోని హెచ్‌ఐజీ 53లో అక్రమ నిర్మాణం అంటూ చేపట్టిన కూల్చివేతలు దుమారం లేపాయి. 267 గజాల్లో స్టిల్ట్ ప్లస్ 3 అంతస్తులకు జీహెచ్‌ఎంసీ అనుమతి తీసుకొని ఐదు అంతస్తులు నిర్మించారు. ఏడాది క్రితమే భవనం పూర్తయి ప్రస్తుతం ఐదో అంతస్తులోని రెండు ఫ్లాట్స్‌లో ఒకదాంట్లో గత తొమ్మిది నెలలుగా ఓ కుటుంబం అద్దెకు ఉంటోంది. మరో దాంట్లో ఇంటి యజమానికి చెందిన కంపెనీ సిబ్బంది ఉంటున్నారు. నివాసం ఉంటున్న ఇంటిని ఎటువంటి అనుమతి లేకపోయినా హైడ్రా కూడా కూల్చదని ప్రకటించిన నేపథ్యంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తాజాగా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి దగ్గరుండి తాళం తొలగించి కిటికీలు, గోడలు తొలగించడమే కాదు.. స్లాబ్‌కు రంధ్రాలు పెట్టడం కూకట్‌పల్లి ప్రాంతంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇది ఇలా ఉండగా.. గతంలో ఇక్కడ పనిచేసిన సూపర్‌వైజర్, లైన్‌మెన్‌కు ముడుపులు ఇచ్చారా? కొత్తగా వచ్చిన నన్ను పట్టించుకోరా అన్న కోణంలో ఆమె వ్యవహరించారా అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదే భవన నిర్మాణంలో ఇద్దరు ముగ్గురు తొలి నుంచీ ఫిర్యాదులు చేస్తూనే ఉండడంతో ఇదే అదనుగా చేసుకొని టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతలకు పాల్పడినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న మేమే టీపీఎస్ మా ఇంటిని కూల్చడానికి మీకు ఉన్న అధికారాలు ఏంటి, ఉంటే ఏదైనా నోటీసు చూపండంటూ ఆమెపై వాగ్వాదానికి దిగడంతో పనులు ఆపేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఇంటి యజమాని సోదరుడు సుబ్బారావు తెలిపారు. దీనిపై టీపీఎస్ ప్రభావతి, ఏసీపీ మల్లేశ్వర్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా వారు అందుబాటులోకి రాలేదు.

నీటి సమస్యలు లేకుండా చేస్తున్నాం

● జలమండలి సెక్షన్ మేనేజర్ రోహిణి



గాజులరామారం ప్రాంతంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నామని గాజులరామారం జలమండలి సెక్షన్ మేనేజర్ రోహిణి అన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారి ఆదేశాల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.
గాజులరామారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ...

● **ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వాటికి జలమండలి ఎలా నీటి కనెక్షన్‌లు ఇచ్చింది.**

ప్రభుత్వ భూముల్లో వెలిసిన నిర్మాణాలకు ఎటువంటి నీటి కనెక్షన్‌లు ఇవ్వలేదు. అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి, ముందుగా ఆ ప్రాంతాన్ని ఎంక్వయిరీ చేసి అన్ని పత్రాలు సరిగా ఉంటేనే నీటి కనెక్షన్‌లు ఇవ్వడం జరుగుతుంది.

● **కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారు వాటర్ కనెక్షన్ తీసుకోవడానికి ఏమి చేయాలి?**

గృహనిర్మాణం 100 గజాల లోపు ఉంటే రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉంటే ఎంక్వయిరీ చేసి, కనెక్షన్ ఇస్తున్నామన్నారు. 120 గజాలు కన్నా ఎక్కువ ఉంటే జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం కనెక్షన్‌లు ఆరు రోజుల్లో ఇస్తారు.

● **కాలనీల్లో కొత్త కనెక్షన్ల ఏర్పాటుకు ఉన్న రోడ్డును తవ్వి, పనులు పూర్తయిన తరవాత అలాగే వదిలేస్తున్నారు. దీనిపై మీ స్పందన?**

నూతన పైప్‌లను వేసేటప్పుడు సీసీరోడ్డు ఉంటే జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదించి, రోడ్డును పగలకొట్టడం జరుతుంది. ఆ తరవాత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రోడ్డును నిర్మిస్తున్నారు.

● **జీరో నీటి కనెక్షన్ పొందాలంటే ఏమి చేయాలి?**

ప్లాట్ డాక్యుమెంట్స్, ఇన్‌కం సర్టిఫికెట్ ఒరిజినల్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు, ఇంటి ముందు యజమాని నిలబడిన దిగిన ఫొటో, ఒక్క రూపాయితో అప్లై చేసుకుంటే, ఆ తరవాత ఎంక్వేరి చేసి, అధికారుల ఆదేశాలతో వాటర్ కనెక్షన్ ఇస్తాం.

అనుమతులు ఒకలా ... నిర్మాణాలు మరోలా!

● తీరు మారని అధికారులు ● అడుగడుగునా అక్రమ నిర్మాణాలు
● జోరుగా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలు

షాపూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం డివిజన్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. ఎక్కడ చూసిన బహుళ అంతస్తుల భవనాలు, అక్రమ నిర్మాణాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. మాకెంత ఇస్తావు... నీవెంత కట్టుకొంటావ్ అన్న చందంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలి ఉంది. పర్మిషన్‌లు తీసుకొనే సమయంలో ఒకవిధంగా తీసుకొన్నాక మరోవిధంగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నెలసరి జీతం కన్నా అక్రమంగా సంపాదించేదే ఎక్కువగా ఉంటుందని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణాలకు జీప్లస్ 2 పర్మిషన్ ఉండగా ఆ విధంగానే బిల్డింగ్ పర్మిషన్లు తీసుకొని తరువాత జీప్లస్ 3, 4, 5 వరకు బహుళ అంతస్తులు నిర్మిస్తూ అడిగిన వారికి ముడుపులు ముట్టచెపుతున్నారు. ఎవరైనా నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా అని అడిగితే అన్ని పర్మిషన్‌లు ఉన్నాయని, గట్టిగా నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్న నిర్మాణాలను అదుపు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. హైడ్రా పేరుతో అక్రమ నిర్మాణాలు, కబ్జాలను తొలగిస్తున్నా, వారి పని వారు యధేచ్ఛగా చేసుకొంటూపోతున్నారు. పై అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కిందిస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. నిర్మాణదారులకు సహకరిస్తున్నారని, ప్రతీ రోజు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా, పలు వార్తా మాధ్యమాల్లో వార్తలు వస్తున్నా, పెడచెవిన పెడుతున్న అధికారులపై నిఘా పెట్టి, గట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, కళావతి నగర్, రాజీవ్‌గాంధీనగర్, హనుమాన్‌నగర్, సూరారం గ్రామం తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలు బేఖాతర్ చేస్తూ, భారీగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఊతమిస్తున్నారు. సూరారం డివిజన్‌లోని హనుమాన్‌నగర్ సమీపంలో రెండస్తుల అనుమతులు తెచ్చుకొని, దానిపై అదనపు నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకొని, అధికారులు నిబద్ధతతో పని చేయాలని కోరుకుంటున్నారు.



సూరారంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం



షాపూర్‌నగర్‌లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి



అనుమతుల్లో తీసుకున్న విధంగా నిర్మాణాలు ఉండాలని, అందుకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడే విధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టే వారిపై, దీనికి సహకరించే అధికారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలి. అక్రమ భవన నిర్మాణదారులతో స్థానిక, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ములాఖత్ కావడంతోనే ఈ నిర్మాణాలకు ఇలాంటివి జరుగుతున్నాయి.

- నల్లనాగుల దయాకర్‌చారి, ఆదర్శనగర్

జీడిమెట్ల పారిశ్రామికవాడలో దర్జాగా నాలా కబ్జా

జీడిమెట్ల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీలో నాలా ఆక్రమణకు గురవుతుంది. ఓ పరిశ్రమ యాజమాన్యం దర్జాగా నాలా సగభాగాన్ని కబ్జా చేస్తూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నా టీఎస్ఐఐసీ ఐలా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎంతో విశాలంగా ఉన్న నాలాను అధికారుల అండదండలతో కబ్జాచేసి నాలా పైనే నిర్మాణాలు సాగించారు. నాలాలు ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక పక్క ప్రభుత్వం ప్రకటించింది.

హైడ్రా కూల్చివేతలు సాగిస్తున్నా, జీడిమెట్ల పారిశ్రామికవాడలో మాత్రం ఐలా అధికారులు మా రూటే సెపరేటు అంటున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థజలాలు, వర్షపు నీటి వరద ప్రవాహం కోసం వదిలిపెట్టిన నాలాపైనే స్లాబ్‌లు వేసి నిర్మాణాలు చేపట్టడాన్ని స్థానిక పారిశ్రామికవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీలో దాదాపు 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఓ అధికారి పరిశ్రమల యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సాహిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే పరిశ్రమల ముందు కంకర, ఇసుక పోసి వ్యాపారాలు చేస్తూ పరిశ్రమల నిర్వాహకులను ఇబ్బందులుపాలు చేస్తున్నారు. అదేవిధంగా డీపీ కాలనీ వద్ద నడిరోడ్డుపై క్రేన్‌లు పార్కు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే నాలా కబ్జాలను అరికట్టకపోతే భవిష్యత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుంది.



నాలాలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్

నాలా అక్రమణలపై చర్యలు తీసుకుంటాం

వెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీలో నాలా ఆక్రమించి నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ విషయంపై ఐలా కమిషనర్ విజయను వివరణ కోరగా పరిశీలించి, ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని అన్నారు.

- ఐలా కమిషనర్, విజయ



● **వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టండి**

జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ బొమ్మ చౌరస్తాలో వీధిదీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం విద్యుత్ విభాగం అధికారులు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- కుత్బుల్లాపూర్(ఆంధ్రజ్యోతి)

మరమ్మతులు చేశారు సరే... ప్యాచ్‌వర్క్ పనులు ఎప్పుడు?



మరమ్మతులు చేసి, మట్టితో కప్పివేసిన లీకేజీ గుంత

షాపూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాగునీటి లీకేజీల పేరుతో రోడ్డును తవ్వి, మరమ్మతులు నిర్వహించి, ప్యాచ్‌వర్క్ పనులను వదిలేస్తున్నారు. జలమండలి కార్యాలయం సమీపంలోని పీహెచ్‌సీయూ మూల మలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన లీకేజీకి వారం రోజుల క్రితం జలమండలి సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ప్యాచ్‌వర్క్ చేయకుండా వదిలేసి, మట్టితో కప్పారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్యాచ్‌వర్క్ పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

నిజాంపేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ గ్రామంలోని పోస్టాఫీసు ముందు పైప్‌లైన్ కోసం నడిరోడ్డులో ఎక్సలేటర్‌తో తవ్వకాలు చేపట్టడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



మొదలైన తవ్వకాలు



సిద్ధంగా ఉన్న పైప్‌లు

యథాతథంగా రిజిస్ట్రేషన్లు జరిగేందుకు మంత్రి హామీ : కూన



మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందిస్తున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో యథాతదంగా రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా కృషిచేస్తానని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిలిచిపోయిన భూ రిజిస్ట్రేషన్‌ల సమస్యలను పరిష్కరించాలని శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్థానిక నాయకులతో కలిసి శ్రీశైలంగౌడ్ వినతిపత్రం అందచేశారు. కొన్ని కాలనీలలో వక్ఫ్‌బోర్డు స్థలాల నెపం చూపిస్తూ, సర్వే నంబర్ 58 నుంచి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా సబ్ రిజిస్ట్రార్ నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనుమతులతో పాటు, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వాటికి రిజిస్ట్రేషన్‌లు చేయాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు ఆదేశాలు జారీ చేశారని శ్రీశైలంగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, అప్పారావు, వెంకట రమణయ్య, ఓబుల్‌రెడ్డి, సత్యం, హర్షారెడ్డి, రాజేష్, రాజీవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దాం

● ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలో 49 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బి.విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ హయాంలో కోట్లాది రూపాయాలు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసామన్నారు. ఈ సందరంగా సీసీరోడ్డు, ఓపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎరువ శంకరయ్య, సుధాకర్, జల్దా లక్ష్మీనాథ్, ఓంకార్‌రెడ్డి, క్రాంతి యాదవ్, యాదిరెడ్డి, కార్తీక్‌గౌడ్, తారకరాణి, ఈశ్వరి, సాయికిరణ్ పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్.

వ్యాపార సముదాయాలను తొలగించకుండా చూడాలి

దుండిగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్‌గృహకల్ప సముదాయానికి సంబంధించిన స్థలాల్లో స్థానికంగా నివాసం ఉంటున్న చిరు వ్యాపారులు, జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న షాపులను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించకుండా చూడాలని చిరు వ్యాపారులు శనివారం బాచుపల్లిలోని కొలన్ హన్మంత్‌రెడ్డి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గత 13 సంవత్సరాలుగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటున్నామని, ఆ సముదాయాలను మున్సిపల్ అధికారులు తొలగించకుండా చూడాలని హన్మంత్‌రెడ్డికి మొర పెట్టుకున్నారు. షాపులను తొలగించి, ప్రహారీగోడ నిర్మించే ప్రయత్నం జరుగుతుందని, ఆ పనులను నిలిపివేయించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, నర్సింహా, నాగ భూషణం, మహేష్, పుష్పలత, విజయలక్ష్మి ఉన్నారు.



కొలన్ హన్మంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న చిరు వ్యాపారులు

నిరుపేద బాలికలకు చేయూత అందించడమే లక్ష్యం

● లైలా పూనవాల

నిజాంపేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగి, పేదరికంలో మగ్గుతూ ఇంజనీరింగ్ చదవాలన్న కోరికను సాకారం చేసుకోలేకపోతున్న నిరుపేద బాలికలకు చేయూతను అందించడమే తమ సంస్థ లక్ష్యమని లైలా పూనవాల ఫౌండేషన్ చైర్‌పర్సన్ పద్మశ్రీ అవార్డు గ్రహిత, లైలా పూనవాల అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బాచుపల్లిలోని వీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పేద విద్యార్థులకు చేయూతనందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు ప్రతి సంవత్సరం వారి స్థితిగతులను బట్టి స్కాలర్‌షిప్ రూపంలో ఇంజనీరింగ్ చదువుకు ప్రోత్సాహన్ని అందిస్తుందన్నారు. హైదరాబాద్‌లో ఎంపిక చేసిన 136 మంది బాలికలకు స్కాలర్‌షిప్ సర్టిఫికెట్లను అందజేశా రు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సీడీ నాయుడు, లైలా పూనవాల ఫౌండేషన్ ట్రస్టీ ఫిరోజ్ పూనవాల, కళాశాల డైరెక్టర్ చెన్న కేశవరావు, అస్మితపాటిల్, డాక్టర్ సంజయ్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థినీలు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న లైలా పూనవాల

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి : సీపీఎం

షాపూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, అధిక ధరలను అరికట్టాలని శనివారం సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు, అక్కడ నుంచి భవన నిర్మాణ కార్మికుల చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా ఆందోళనలను నిర్వహించడం జరుగుతుందని, 2014 ఎన్నికల్లో అచ్చాదిన్ పేరుతో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పి.అంజయ్య, దేవదానం, బి.సత్యం, రావుల స్వాతి, ఎండి జాకీర్‌హుస్సేన్, డి.కరుణాకర్, పార్టీ సీనియర్ నాయకులు జి.వెంకన్న, మల్లారెడ్డి, టీవీఎస్ రమణ, ఆంజనేయులు, శ్రీశైలం, నర్సింహులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మట్టితో నిండిన మ్యాన్‌హోల్స్...స్థానికుల ఆందోళన

నిజాంపేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బండారి లే-అవుట్ రోడ్డు నం.10-సిలో మూడు అపార్టుమెంట్లు కలిగిన ప్రాంతంలో స్థానికులకు కనీస సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారుల ఆదేశాల పేరుతో మ్యాన్‌హోల్స్‌ను మట్టితో పూడ్చేస్తున్నారు. విషయాన్ని గమనించి అపార్టుమెంట్ వాసి బ్రహ్మరావు ఇలా మ్యాన్‌హోల్స్‌ను పూడ్చితే నీరంతా వీధుల్లో పారే అవకాశం ఉందని, కాబట్టి మట్టిని తొలగించాలని మున్సిపల్ సూపర్‌వైజర్ రవిని కోరారు. దీంతో పూడ్చిన మట్టిని ఆయన బయటకు తీయించాడు.



మ్యాన్‌హోల్ నుంచి మట్టిని బయటకు తీస్తున్న సిబ్బంది

బాలయ్యనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

గాజులరామారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని బాలయ్యనగర్‌లో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సుమారు మూడు వందలమంది వైద్య పరీక్షలు చేయించుకొని, మందులను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, వైద్యులు కీర్తన, శ్వాత, నర్సులు సునిత, ఆశ,సన్నీ, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బస్తీవాసులు

పరిశ్రమల పొల్యూషన్‌తో నరకం చూస్తున్నాం

నిజాంపేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని ఎలీప్ పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల నుంచి ప్రతిరోజు చీకటిపడే సమయానికి విషవాయువులను గుట్టుచప్పుడు కాకుండా గాలిలోకి వదిలేస్తున్నారని, ఆ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ నివాసితులు శనివారం ఆందోళన చేపట్టారు. గత మూడు రోజులుగా పడుతున్న ఇబ్బందుల గురించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలీప్ పారిశ్రామికవాడలోని కొన్ని ఫ్యాక్టరీలు కెమికల్ వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నాయని, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఒక ఫ్యాక్టరీ ప్రాంగణం అంతా డ్రైనేజిలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రతీ ఫ్యాక్టరీలోను ఇదే పరిస్థితి నెలకొని ఉందని, ప్రగతినగర్ ఏరియాలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతున్నాయన్నారు. దీంతోపాటు చర్మ సమస్యలు, జుట్టు ఊడిపోవడం, నరాల బలహీనత వంటి ఇతర సమస్యలను స్థానికులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలీప్‌లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలను మూసివేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న స్థానికులు

కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయండి

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను కోరిన సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో, హత్య, హత్యాచారం, ఎన్‌డీపీఎస్ వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు గరిష్ఠ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి కోరారు. సైబరాబాద్ కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసి పీపీ, ఏపీపీల రివార్డుల కార్యక్రమంలో పీపీలు, ఏపీపీలు, ఐఓలు, ఇన్‌స్పెక్టర్‌లు, లైసన్ ఆఫీసర్, సీడీడీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ నమోదైన కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు. దీనికోసం జోనల్ డీసీపీలు విచారణాధికారులు, కోర్టు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ పోలీసులు, న్యాయ వ్యవస్థ కలిసి పనిచేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శోభారాణి మాట్లాడుతూ రివార్డుల మేళాలు ఏర్పాటు చేయడం ద్వారా శిక్షల శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పీపీ, ఏపీపీలు, లైసనింగ్ అధికారులు పాల్గొన్నారు.



గరిష్ఠ శిక్షపడేలా చూసిన అధికారులకు మెమెంటోలు ఇస్తున్న సీపీ అవినాష్ మహంతి

పబ్‌ను సీజ్ చేయాలని సీపీకి ఫిర్యాదు

నిజాంపేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి సర్వే నంబరు 56, 62/పి పక్కన బాచుపల్లి మెయిన్ టీవీఎస్ షో రూమ్ ప్రాంతంలో గోల్డెన్ బార్ కనీస అనుమతులు లేకుండా ప్రారంభించడంపై చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ బీజేపీ నాయకులు ఆకుల సతీష్, అరుణ్‌రావులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ, వినతి పత్రాన్ని సమర్పించారు. బార్, పబ్ ఏర్పాటుకు పోలీస్, మున్సిపల్, ఫైర్ డిపార్టుమెంట్ల నుంచి అనుమతులు పొందకుండానే వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడం చట్టరీత్యా నేరమని, దీనిపై చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు.



బాచుపల్లి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన గోల్డెన్ బార్ అండ్ పబ్

చెకుముకి సంబురాల్లో పాల్గొనాలి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబర్‌లో జరుగనున్న చెకుముకి సంబురాల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని డీఈఓ రోహిణి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవంబర్ 7న పాఠశాలస్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయిల్లో సైన్స్ టెస్ట్‌లుంటాయని తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్సీ లింగస్వామి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎం .రవీంద్రబాబు, నగర నాయకులు పాల్గొన్నారు.